ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



22 రైళ్లకు అదనపు బోగీలు

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్ మెంట్ కోసం జరగనున్న పరీక్షల కోసం 22 ప్రముఖ రైళ్లకు ఈ నెల 23 నుంచి 26వరకు అదనపు బోగీలను అమర్చనున్నట్లు నైరుతి రైల్వేజోన్ ప్రకటించింది. డిమాండ్‌ను బట్టి ఒకటి లేదా రెండు చొప్పున అదనపు బోగీలను అమర్చనున్న ట్లు వెల్లడించింది. రాష్ట్రంలోని పలు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని నగరంలో మంగళవారం విడుదలైన ప్రకటనలో పేర్కొంది. అన్ని ప్రముఖ రైల్వేస్టేషన్‌లలోనూ ఈ విషయాన్ని ప్రక టిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

న్యాయం దక్కేంత వరకూ

- కేంద్రం తీరు దారుణం
- మాకు అభివృద్ధి, గ్యారెంటీలు రెండు కళ్లు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్
- శాసనసభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

నిలదీస్తూనే ఉంటాం





శాసనసభలో పాల్గొన్న సభ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి న్యాయం దక్కేంత వరకు కేంద్రాన్ని నిలదీస్తూనే ఉంటామని, ఇది ఏమాత్రం తప్పు కాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు మంగళవారం సీఎం సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం మధ్యే సీఎం ప్రసంగం కొనసాగింది. నిరుపేదల కోసం బియ్యం అడిగినా కేంద్రం స్పందించలేదని సీఎం నిప్పులు చెరిగారు. సమాఖ్య వ్యవస్థలో కర్ణాటక కూడా భాగంగా ఉందన్నారు. డబ్బులిచ్చి కొనేందుకు సైతం బియ్యాన్ని నిరాకరించడం ద్వారా కేంద్రం నిరుపేదలకు అన్యాయం చేయడం లేదా..? అని ప్రశ్నించారు. కిలో రూ.34 చొప్పున బియ్యం కొనుగోలు చేస్తామని విన్నవించుకున్నప్పుడు స్పందించని కేంద్రం ఇటీవల 'భారత్ బియ్యం' పేరిట కిలో రూ.29కే విక్రయిస్తోందన్నారు. అన్యాయం జరిగితే ప్రశ్నించకూడదా అని నిలదీశారు. ఢిల్లీలో తాము అదే చేశామని తెలిపారు. రాష్ట్రం నుంచి 26 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా పన్నుల వాటా, కరువు సాయం తీసుకురావడంలో విఫలమయ్యారని విరుచుకుపడ్డారు. రాష్ట్రం నుంచి వెళ్తున్న ప్రతి వంద రూపాయలలో తమకు 12-13 రూపాయలు మాత్రమే తిరిగి వస్తోందన్నారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు మోదీ 50 శాతం పన్నులవాటాను డిమాండ్ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, గ్యారెంటీ పథకాలు తమకు రెండు కళ్లలాంటివని అన్నారు. గ్యారెంటీ పథకాల కోసం రూ.52,009 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని, వీటి విషయంలో ప్రజలు ఏ విధంగాను ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్ర త్యేకించి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేయడంలో బీజేపీది సిద్ధహస్తమన్నారు. అబద్ధమే వారి ఇంటిదేవుడంటూ చురకలంటించారు. బీజేపీకి రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. కార్మిక, మహిళా రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందన్నారు. మైనారిటీల సంగతైతే చెప్పాల్సిన పనిలేదన్నారు. వారి ఊసెత్తితేనే బీజేపీకి నిలువెల్లా మండుతుందన్నారు. 2019 నుంచి 2023 వరకు తుప్పుపట్టిన బీజేపీ బస్సు విషపొగలు చిమ్మడంతో ప్రజలు పక్కకు పెట్టేశారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దివ్యంగా ఉందని, కేవలం 9నెలల అవధిలో రూ.77వేల కోట్లకు పైగా పెట్టుబడులు తరలిరావడమే ఇందుకు తార్కాణమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా ఉందని బీజేపీ నేతలు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తిప్పికొట్టారు. 2013లో ప్రజల ఆశీస్సులతో స్పష్టమైన మెజారిటీ సాధించామన్నారు. బీజేపీ ఇంతవరకు సొంతబలంతో ఒక్కసారి కూడా అధికారంలోకి రాలేదన్నారు. ప్రతిసారి ఆపరేషన్ కమల ద్వారా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందన్నారు.

గవర్నర్‌పై పొగడ్తల వర్షం

ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన ప్రసంగంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌పై పొగడ్తల వర్షం కురిపించారు. ప్రభుత్వ విధానాలను శాసనసభలో ధైర్యంగా ప్రకటించడం ద్వారా ఆయన సభాగౌరవాన్ని కాపాడారని కొనియాడారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో గవర్నర్లు తమ సొంత ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. కర్ణాటక గవర్నర్ మాత్రం ఇందుకు భిన్నంగా రాజ్యాంగంపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. గవర్నర్ గొప్ప సంస్కారవంతుడంటూ కొనియాడారు. పత్రికలు కూడా ఇటీవలి బడ్జెట్‌ను మెచ్చుకున్నాయన్నారు.

కరువుసాయం విడుదల చేయండి

లౌకిక ముసుగును తీసేసిన జేడీఎస్ నేత కుమారస్వామి ప్రస్తుతం బీజేపీ తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారని సీఎం చురకలంటించారు. రాష్ట్రంలో కరువు విలయతాండం చేస్తోందని 17 సార్లు కేంద్రానికి లేఖలు రాసినా ప్రయోజనం శూన్యమని సీఎం విరుచుకుపడ్డారు. ఒక్కదానికి కేంద్రం స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనూ, బీజేపీ పాలనలోనూ సంక్షేమ పథకాలకోసం వెచ్చించిన నిధుల వివరాలను సీఎం సభకు సోదాహరణంగా వివరించారు. కేంద్రం ఇకనైనా కరువుసాయం ప్రకటించాలని, రాష్ట్ర పన్నుల వాటా బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వానిది పలాయన వాదం : బీజేపీ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని బీజేపీ దుయ్యబట్టింది. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం సమాధానం ఇవ్వడం రాజకీయ ప్రసంగాన్ని తలపించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర వ్యాఖ్యానించారు. విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అభివృద్ధికి గ్రాంట్లు విడుదల కావడం లేదన్నారు. అధికార పార్టీలోనూ అసంతృప్తి రగులుతోందన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి వెళ్లి ప్రధానిని విమర్శించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రిది పలాయనవాదమన్నారు.

సీఎంను దించేస్తే ప్రభుత్వ పతనం : యత్నాళ్

ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అధికారం నుంచి కిందకు దించేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కావడం ఖాయమని బీజేపీ సభ్యుడు యత్నాళ్ శాసనసభలో వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం ప్రసంగిస్తున్నవేళ ఆయనపై విధంగా వ్యాఖ్యానించారు. అడ్జస్ట్‌మెంట్ రాజకీయాల కారణంగానే తాము ఓడిపోయామని యత్నాళ్ పేర్కొన్నారు. ఇందులో ఎవరు అడ్జస్ట్ అయ్యారంటూ సీఎం ఆయనను ప్రశ్నించగా బదులివ్వలేదు.

గవర్నర్ నోట పచ్చి అబద్ధాలు : బొమ్మై

గవర్నర్ నోట ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పించిందని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై విరుచుకుపడ్డారు. శాసనసభలో సీఎం ప్రసంగిస్తున్న వేళ జోక్యం చేసుకున్న ఆయన పాల ఉత్పత్తిదారులకు గత ఆరు నెలలుగా ప్రోత్సాహధనం ఇవ్వడం లేదన్నారు. ఇందుకు విరుద్ధంగా రాష్ట్రంలో 8.65 లక్షల పాడిరైతులకు రూ. 757 కోట్ల ప్రోత్సాహధనాన్ని వారి ఖాతాలకు నేరుగా బదిలీ చేసినట్లు గవర్నర్ నోట చెప్పించారన్నారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కూడా కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుందని మండిపడ్డారు.

ప్రతిపక్షాల వాకౌట్

ముఖ్యమంత్రి ప్రసంగం అబద్ధాల పుట్టగా ఉందని, రాజకీయ దురుద్దేశ్యాలతో కూడి ఉందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలపై బీజేపీ, జేడీఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కాగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసనసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.



మాట్లాడుతున్న బీజేపీ సభ్యులు

విధానపరిషత్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జయభేరి

- 1507 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందిన పుట్టణ్ణ



పుట్టణ్ణ విజయోత్సాహం



కాంగ్రెస్ కార్యకర్తల సంబరం

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లోని బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ తన సమీప బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ఏపీ రంగనాథ్‌పై 1507 ఓట్లతో ఘన విజయం సాధించారు. ఈనెల 16న జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగింది. ప్రారంభం నుంచి తన ఆధిక్యతను పుట్టణ్ణ కాపాడుకుంటూ వచ్చారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 19,152 ఓట్లు ఉండగా 16,544 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పుట్టణ్ణకు 8,260 ఓట్లు, రంగనాథ్‌కు 6,753 ఓట్లు లభించాయి. 1,239 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి రంగనాథ్ ఈసారి గట్టిపోటీ ఇచ్చినా పుట్టణ్ణ మళ్లీ ఈ నియోజకవర్గంలో తన ఆధిక్యతను నిలబెట్టుకోవడం విశేషం. పరిషత్ ఎన్నికల్లో పుట్టణ్ణ విజయం సాధించడంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య హర్షం వ్యక్తం చేశారు. 9 నెలల కాంగ్రెస్ సంక్షేమ పాలనకు ప్రజలు గెలుపు రూపంలో ఆశీర్వదించారన్నారు. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడిగా అభ్యర్థిని బరిలోకి దించినా ఓటమి చవిచూశాయని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం కానున్నాయని జోస్యం చెప్పారు. జేడీఎస్ తన లౌకికవాద ముసుగును తీసేసి మతతత్వ అవతారమెత్తిందని, ఆ పార్టీకి ఈ ఫలితం చెంపపెట్టులాంటిదని అన్నారు. రాష్ట్రంలో మతోన్మాదుల ఆటలు సాగవన్నారు. ప్రజలు గట్టిగుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉ పముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యం విజయం అన్నారు. అపవిత్ర పొత్తును ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ప్రజా తీర్పును స్వీకరిస్తున్నామని, అధికార కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చామని, ఓటమికిగల కారణాలను సమీక్షించుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. జేడీఎస్‌తో పొత్తు ప్రారంభంలోనే విఫలమైందా అని ప్రశ్నించగా పరిమితమైన ఓట్లు ఉండే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఉండదని తెలిపారు.

ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూ టైంటేబుల్ విడుదల

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి కీలకమైన ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూ పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప మంగళవారం విధానసౌధలో వివరాలు వెల్లడించారు. ద్వితీయ పీయూ పరీక్షలు మార్చి 1నుంచి 22వరకు జరగనున్నాయి. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు మార్చి 25 నుంచి ఏప్రిల్ 6వరకు కొనసాగనున్నాయి. మీడియా సమావేశంలో ప్రాథమిక విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రితేశ్‌కుమార్‌సింగ్, కర్ణాటక పాఠశాల పరీక్ష మౌల్యమాపన నిర్ణయ మండలి అధ్యక్షురాలు మంజుల, పీయూ విద్యాశాఖ డైరెక్టర్ సింధూ బి. రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మంత్రి మధుబంగారప్ప తదితరులు

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల తేదీలు

ఉదయం 10.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 25న ప్రథమభాష కన్నడ, ఆంగ్లం, హిందీ, మరాఠీ, తమిళం, ఉర్దూ, సంస్కృతం, 27న సమాజ విజ్ఞానం, 30న విజ్ఞాన, రాజ్యశాస్త్రం, హిందూస్తానీ సంగీతం, కర్ణాటక సంగీతం, ఏప్రిల్ 2న గణితం, సమాజ శాస్త్రం, 3న అర్థశాస్త్రం, 4న తృతీయభాష కన్నడ, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పర్షియన్, తుళు, 6న ద్వితీయ భాష ఇంగ్లీష్, కన్నడ పరీక్షలు జరగనున్నాయి.



ద్వితీయ పీయూ పరీక్షలు..

మార్చి 1న కన్నడ, అరబిక్, 4న గణితం, శిక్షణశాస్త్రం, 5న రాజ్యశాస్త్రం, సంఖ్యాశాస్త్రం, 6న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రిటైల్, ఆటోమొబైల్, 7న ఇతిహాసం, భౌతికశాస్త్రం, 9న ఆప్షనల్ కన్నడ, లెక్కశాస్త్రం, భూగర్భశాస్త్రం, గృహ విజ్ఞానం, 11న తర్కశాస్త్రం, వ్యవహార అధ్యయనం, 13న ఆంగ్లం, 15న హిందూస్తాని సంగీతం, మనఃశాస్త్రం, రసాయనశాస్త్రం, బేసిక్ మ్యాథ్స్, 16న అర్థశాస్త్రం, 18న భూగోళశాస్త్రం, జీవశాస్త్రం, 20న సమాజశాస్త్రం, ఎలక్ట్రికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, 23న హిందీ పరీక్షలు జరగనున్నాయి.

రాజధానిలో విలీన గ్రామాలకు మే నాటికి కావేరి జలాలు

- శాసనసభలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



సభలో ప్రకటన చేస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో విలీనమైన 110 గ్రామాలకు మే చివరినాటికి కావేరి జలాలను అందుబాటులోకి తెస్తామని ఉపముఖ్యమంత్రి, బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల వేళ యశ్వంతపుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ యుద్ధ ప్రాతిపదకన ఈ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. బెంగళూరు నగర పరిధిలోని ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గానికి తలా రూ.10కోట్లు గ్రాంటు విడుదల చేశామని, వీటితో నగరవ్యాప్తంగా 11వేల బోరుబావులు తవ్వాలని సూచించారు. ఫలితంగా వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడవచ్చునని పేర్కొన్నారు. గ్రాంట్ల విడుదల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాల ప్రశ్నే లేదన్నారు. నియోజకవర్గాల వారీగా చేపట్టిన పనులను ఆయన సభకు వివరించారు.

నటుడు ధ్రువసర్జాకు త్రుటిలో తప్పిన ప్రమాదం

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చందనసీమకు చెందిన ప్రముఖ నటుడు ధ్రువసర్జా, మార్టిన్ చిత్రం యూనిట్ విమాన ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. ఈ విషయాన్ని ధ్రువసర్జా స్వయంగా సోషల్ మీడియాలో మంగళవారం పోస్ట్ చేశారు. మార్టిన్ చిత్రంలోని ఓ పాట చిత్రీకరణ కోసం ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సమయంలో ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. పైలట్ సమయస్ఫూర్తితో సురక్షితంగా కిందకు ల్యాండ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇది తనకు పునర్జన్మలాంటిదని నటుడు ధ్రువసర్జా పేర్కొన్నారు. కోట్లాదిమంది అభిమానుల ఆశీస్సులతోనే సురక్షితంగా చిత్రం యూనిట్ ప్రాణాలతో బయటపడిందని దర్శకుడు ఏపీ అర్జున్ మీడియాకు తెలిపారు.

బీజేపీది ప్రచార ఆర్భాటం

- లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి వంద సీట్లు కూడా రావు
- సంక్షేమం పట్టని కేంద్రం
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే


సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే





వేదికపై ఖర్గేకు సన్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి ప్రచార ఆర్భాటం తప్పితే ప్రజా సంక్షేమం అసలు పట్టడం లేదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. బీదర్‌లో మంగళవారం జరిగిన భారీ బహిరంగసభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. ఈసారి బీజేపీకి 370 సీట్లు వస్తాయని, ఎన్డీయేకు 400 సీట్లు అంటూ మీడియాలో రంగురంగుల కథనాలు వస్తున్నాయన్నారు. అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ స్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. న్యాయం కోరుతున్న రైతులను ఉగ్రవాదులుగా చూపుతూ ఉక్కుపాదం మోపుతున్న తీరును ఆయన ప్రస్తావించారు. బీజేపీ, సంఘ్ పరివార్ విద్వేషపూరిత అజెండాతో ఇప్పటికే సమాజంలో సామరస్యం దెబ్బతిందన్నారు. సమాఖ్య వ్యవస్థను తూట్లు పొడుస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలను పావుగా వాడుకుంటూ ప్రతిపక్షాలను, బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను భయకంపితులను చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయయాత్రకు లభిస్తున్న భారీ స్పందనను చూసి తట్టుకోలేక ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను నిత్యం విమర్శిస్తున్నారన్నారు. ప్రధానికి కాంగ్రెస్ మేనియా ఆవహించిందన్నారు. 'ఇండియా' కూటమి ముక్క లు చెక్కలైందన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. లోక్‌సభ ఎన్నికల నాటికి దేశ రాజకీయాలు కొత్త మలుపు తిరగడం ఖాయమన్నారు. అధికార యంత్రాంగాన్ని మోదీ ప్రభుత్వం అతి దారుణంగా దుర్వినియోగం చేస్తోందని విమర్శిం చారు. చండీఘడ్ మేయర్ ఎన్నికల్లో అక్రమాలు నిజమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంపపెట్టు లాంటిదన్నారు. ధనబలం, అధికార బలంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, సుప్రీం తీర్పుతోనైనాని వారి తీరు మారుతుందని ఆశిస్తున్నామన్నారు. కర్ణాటక, తెలంగాణలో గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ అధికారమిస్తే దేశవ్యాప్తంగా ఈ పథకాలను అమలులోకి తెస్తామన్నారు. రైతులకు కనీస మద్దతుధరను చట్టబద్ధం చేస్తామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.70	1,609.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	506	9,987
సామర్థ్యం (టీఎంసీలు)	9.22	36.04

నేలచూపు చూస్తున్న ఉల్లి ధర

●కిలో రూ.10కి పడిపోయిన దైన్యం ●కన్నీరుమున్నీరవుతున్న రైతులు

బళ్లారి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధర నేలచూపులు చూస్తోంది. వారం క్రితం క్వింటాలు ఉల్లి మేలు రకం రూ.3 వేల వరకూ మార్కెట్‌లో పలికింది. మధ్య రకం, చివరి రకం క్వింటాలు రూ. 2వేలు వరకూ ఉండేది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో మేలు రకం ఉల్లి క్వింటాలు రూ. 1800 నుండి రూ. 2 వేల వరకు పడిపోయింది. ఇక మధ్య, చివరి రకం ఉల్లి సంగతి ప్రత్యేకించి చెప్పనక్కరే లేదు. సరాసరి క్వింటాలు రూ.వేయి ధర పలుకుతోంది. ఫిబ్రవరి మాసంలో బళ్లారి మార్కెట్‌కు ఉల్లిని ఎక్కువగా రైతులు తీసుకొస్తారు. రబీలో బోర్లు, ఇతర నీటి ఆధారంగా ఎక్కువగా ఉల్లిని రైతులు పండించారు. బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌కు రాయచూరు, బళ్లారి, అనంతపురం, కర్నూలు, చిత్రదుర్గం జిల్లాల నుంచి ఉల్లిపాయలు వస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి కూడా సరుకు వస్తోంది.మహారాష్ట్ర లో పండే ఉల్లికి కొంత ప్రత్యేకత ఉంది. అవి ఎక్కువగా లావుగా ఉండడంతోపాటు నాణ్యతగా ఉంటుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఈ ప్రాంత రైతులు పండించే ఉల్లి సైజు చిన్నగా ఉండడమే కాకుండా నాణ్యతగా ఉండక పోవడం కారణంగా పెద్దగా ధర పలకడంలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు పండిస్తున్న ఉల్లికి మార్కెట్‌లో డిమాండ్ లేక క్రయవిక్రయాలు జరగడంలేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా పండిన ఉల్లి ఏపీఎంసీలో అమ్ముడుపోని కారణంగా వాటిని నిల్వ చేయడానికి వీలు లేక వెనక్కు తీసుకుపోలేక మార్కెట్‌లోనే అయినకాడికి అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉల్లి సాగు కాలంలో మంచి డిమాండ్ ఉండేది. అదే ధర ఉంటుందని ఉల్లిని ఎక్కువగా రైతులు సాగుచేశారు. తీరా పంట చేతికి వచ్చాక ధర నేలచూపులు చూస్తుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. కనీసం పంటసాగుకు పెట్టినపెట్టుబడులు కూడా తిరిగిరాకుండా పోయావని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో నిల్వ ఉన్న ఉల్లిపాయలు

మనల్ని మనం మార్చుకున్నప్పుడే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న జడ్జి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20: సామాజిక న్యాయం పొందడంలో మనల్ని మనం చూసుకుని పరివర్తన చెందినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని జడ్జీ రాజేశ్ హొసమనె అన్నారు. జిల్లా పరిపాలనాధికారి, జిల్లాపంచాయితీ, జిల్లాన్యాయసేవల ప్రాధికార సంస్థ సాంఘికశాఖ, శ్రీమతి సరళాదేవి సతీశ్ అగర్వాల్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కళాశాల హాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

చంద్రుడిపైకి వెళ్లిన తర్వాత కూడా మనలోని కొన్ని ప్రాంతాల్లో సామాజిక అసమానత అలాగే ఉందని, సమాజంలో కుల, వివక్ష, లింగవివక్షమత అసమానతలు తొలగినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఈసందర్భంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సతీశ్, సరళాదేవి కాలేజ్ ప్రిన్సిపాల్ మంజునాథరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు. సిబ్బంది, సహాయ ఆచార్యులు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కట్టుమిషన్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 20: తాలుకాలోని పీడీ హళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీనారాయణప్ప, సభ్యులు లింగన్న, బ్రహ్మానందం, శివరాజు, జనార్దన్ నాయక్ నేతృత్వంలో జానకి ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ అన్వర్ బాషా, శ్రీ కౌసల్యాభివృద్ధి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్వర్ బాషా మాట్లాడుతూ మహిళలకు తమ సంస్థల ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లల్లో వుండే మహిళలకు ముందస్తుగా ఒక ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఈ ట్రైనింగ్‌లో కుట్టుమిషన్లు నేర్చుకుని వారి కాళ్లపై వారు నిలబడాలని తెలిపారు.

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న తోరణగల్లు



బసవన్న గుడి సమీపంలో పేరుకుపోయిన చెత్తచెదారం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20: విమానాశ్రయం, జిందాల్ ఫ్యాక్టరీతోపాటు చిన్నపెద్ద పరిశ్రమలతో అభివృద్ధి చెందిన గ్రామం తోరణగల్లు. ఈ గ్రామం బళ్లారి జిల్లాలోనే అత్యంత ధనిక గ్రామం అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడిఉండడం శోచనీయం. గ్రామంలో బస్టాండు లేకపోవడం, సకాలంలో చెత్త తొలగించకపోవడం వలన ఇక్కడ భారీ మొత్తంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. అనియంత్రిత ట్రాఫిక్, ఓపెన్ డ్రైయిన్ల దుర్వాసన, పట్టించుకోని మహిళా సామూహిక మరుగుదొడ్లు, కనీస సౌకర్యాలులేని సామాజిక ఆరోగ్య కేంద్రం వంటి ఇతర మౌలిక సమస్యలతో గ్రామస్థులు బాధపడుతున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం ఈ గ్రామంలో 12వేల జనాభా ఉంది. ఇతర చోట్లనుండి 40వేల మందికి పైగా వలస కార్మికులు వచ్చి నివశిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామ జనాభా 52వేల కంటే ఎక్కువగానే ఉంది. గ్రామంలోని ఐదు వార్డుల్లో జనాభాకు అనుగుణంగా స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటుకాలేదు. పేరుకుపోయిన చెత్త, విపరీతమైన వాహనాల రాకపోకల కారణంగా గ్రామం అంతా కాలుష్యమయంగా మారింది. గ్రామంలోని శరబన్న లేఔట్, 1వ వార్డు, హెచ్ఎల్‌సీ కాలనీ, బన్నిమహంకాళమ్మ దేవాలయం, ఆదర్శనగర్, నాగార్జున హోటల్ కాంప్లెక్స్, పాండురంగ దేవాలయం, మెహబూబ్ నగర్ తదితర చోట్ల కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ నాడ కార్యాలయ సమీపంలోని పశువైద్యశాల ప్రాంగణంతోపాటు ఇతర ముఖ్య ప్రదేశాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. బసన్న దేవాలయం సమీపంలోని గుంత పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి డ్రైనేజీ నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామపంచాయితీకి పరిశ్రమల ద్వారా ఏటా కోట్లాది రూపాయిలు పన్నుల ద్వారా వస్తోందని ఇదంతా దుర్వినియోగం అవుతోందని ప్రజలు అంటున్నారు.

జీవితంలో పరీక్షలకు సిద్ధం కావాలి

శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సిద్దలింగప్ప ఉద్బోధ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20: విద్యాభ్యాసం ముగిసే వరకు సంవత్సరానికి ఒకటి లేదా రెండు పరీక్షలు ఉంటాయని, కాని ఆ తర్వాత జీవితంలో ప్రతిరోజూ పరీక్షలేనని, అఖిల భారత శరణ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిద్దలింగప్ప తెలిపారు. నిజమైన జీవిత పరీక్షలకు సిద్ధం కావడమే జాతీయ సేవాపథకం ఉద్దేశమన్నారు. నగరంలోని ఎస్‌జీటీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ చదువు ఒక్కటే పూర్తి వ్యక్తిత్వ వికాసానికి సరిపోదని, దాంతోపాటు కుటుంబంలో సమాజంలో అందిరితో కలిసిమెలిసి జీవించడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌జీటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ మాట్లాడుతూ, సేవ, సంస్కారాలతో విద్య పరిపూర్ణమవుతుందన్నారు. ఎస్‌జీటీ విద్యాసంస్థ కార్యదర్శి నాగరాజ్ మాట్లాడుతూ, జాతీయ సేవా పథకం నుంచి నిజమైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో గాంధీజీ ఈ పథకానికి ప్రాధాన్యమిచ్చారన్నారు. కార్యక్రమంలో యూనిట్ల అధికారులు ధనుంజయభట్, విహెచ్ రాజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్దలింగప్ప

చీఫ్ కన్జర్వేటర్‌గా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకారం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 20: బళ్లారి నగరంలో మంగళవారం ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్రదుర్గ జిల్లా చెళ్లకెర తాలుకా కురిడిహళ్లి గ్రామానికి చెందిన వారు. గతంలో చామరాజనగర్ జూ చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేసి అక్కడి నుంచి బదిలీపై బళ్లారి జిల్లా ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో దావణగెర, చిత్రదుర్గ, విజయనగరం, కొప్పాళ జిల్లాల్లో చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేశారు. బళ్లారికు బదిలీ కావడంతో ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం పలువురు ప్రముఖులు ఆయనను శాలువా, పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని, పర్యావరణ పరిరక్షణకు, జంతు పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎఫ్ సందీప్, ప్రకాష్ నాయక్, హీరాలాల్ పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకున్న చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు

నిబంధనల ప్రకారమే ఫ్యాక్టరీలు నడపాలి

సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

కంప్లి, ఫిబ్రవరి 20: నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీలు నడపాలని కుడితిని పంచాయతీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పంచాయతీ ప్రాంగణంలో మంగళవారం ఫ్యాక్టరీల సిబ్బందితో జరిపిన సమావేశంలో పట్టణ పంచాయతీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుడితిని పట్టణంలో ఫ్యాక్టరీల సిబ్బందితో తహసీల్దార్ గురురాజు పట్టణ పంచాయతీ సభ్యులతో వివిధ అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వి రాజశేఖర్, వెంకటరమణ బాబు, లెనిన్, హాలప్ప, కనికేరి పంపాపతి, దుగ్గప్ప, రామలింగప్ప, సునిల్, మంజునాథలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ 2001-2002లో కేపీసీఎల్‌కు కుడితిని, తిమ్మలాపురం గ్రామాల్లోని 1860 ఎకరాలు భూములు ఇచ్చామన్నారు. అప్పట్లో కుడితిని, తిమ్మలాపురం గ్రామాలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారని, అదినేటికీ అమలు కాలేదన్నారు. 2006లో కేపీసీఎల్‌ను ప్రారంభించారని, అప్పట్లో కుడితిని, తిమ్మలాపురం గ్రామాలకు విద్యుత్ ఉచితంగా అందిస్తామని, గ్రామంలో రోడ్ల అభివృద్ధి, ఇతర మౌళిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్‌హెచ్ 63 రోడ్డుపైన నుంచే కర్మాగారానికి వాహనాలు వెళ్లేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. కానీ అగ్రిమెంట్‌కు విరుద్ధంగా ప్రస్తుతం కుడితిని కంప్లి రోడ్డులో తిమ్మలాపురం వద్ద నార్త్ గేట్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి డ్రై యాష్, ఫౌండ్ యాష్ లారీలను పెద్ద పెద్ద లోడులతో మళ్లించడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. మూడేళ్లుగా కురుగోడు రోడ్డులో వున్న సహ జిందాల్ (శాతవాహన) కర్మాగారం ఏర్పడిన అనంతరం నుంచి 700 ఎకరాల రైతన్నలు వెళ్లే రోడ్డును బంద్ చేశారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గురురాజు మాట్లాడుతూ.. మూడు నెలలు కాలువలకు నీరు వచ్చే వరకు ఫ్యాక్టరీల నుంచి ప్రతిరోజూ ఒక కర్మాగారం నుంచి పట్టణానికి నీరందించాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అధికారి తీర్థప్రసాద్, ఎస్ఐ ఆరోగ్యయ్య, జగ్గు నాయక్, సిబ్బంది, కౌన్సిలర్లు, ఫ్యాక్టరీ నుంచి వచ్చిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గురురాజుతో చర్చిస్తున్న కౌన్సిలర్లు

ప్రశాంతంగా మోకా మల్లేశ్వర జాతర జరుపుకోవాలి



శాంతిసభలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు, సీఐ రుద్రప్ప తదితరులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 20 : మోకా మల్లేశ్వర స్వామి జాతరను మార్చి 2వ తేదీన గ్రామప్రజలు పండుగ వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశులు సూచించారు మోకా పోలీస్ స్టేషన్ ఆవరణంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో శాంతిసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రుద్రప్ప, ఎస్ఐలు కాళింగ, నాగభూషణ, పంచాయతీ ప్రముఖులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి హుస్సేన్ సాబ్

సిరుగుప్ప, ఫిబ్రవరి 20 : సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరు పోరాటం చేయాల్సిన అవసరం వుందని సిరుగుప్ప తాలుకా సివిల్ జడ్జి హుస్సేన్ సాబ్ తెలిపారు. మంగళవారం తాలుకాలోని దేశనూరు గ్రామంలో సదాశివ పాఠశాలలో తాలుకా పరిపాలన, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జడ్జి హుస్సేన్ సాబ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో విద్య ఎంతో అవసరమని ఆయన తెలిపారు. దేశంలో సామాజికన్యాయం దక్కినప్పుడే ప్రపంచం ముందడుగు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్ పాల్గొన్నారు.

సామాజిక లోపాలను సరిదిద్దిన సర్వజ్ఞుడు

బీడీఏఏ హాల్లో జయంతి ఉత్సవాలను ప్రారంభించిన మేయర్ శ్వేత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20: వచన యుగానికి చెందిన సర్వజ్ఞ తన త్రిపది వచనం గానం ద్వారా సమాజంలోని అవకతవకలను సరిచేశారని నగర మేయర్ బి.శ్వేత అన్నారు. నగరంలోని బీడీఏఏ పుట్‌బాల్ గ్రౌండు హాల్లో మంగళవారం జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర కార్పోరేషన్ ఆధ్వర్యంలో సర్వజ్ఞ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సర్వజ్ఞ గొప్ప దూరదృష్టి గల వ్యక్తులలో ఒకరని, సర్వజ్ఞులైన కవులు రచించని పద్యాలు లేవు అన్నారు. గ్రూప్ రిసోర్స్ పర్సన్‌గా బెంగళూరు నుంచి విచ్చేసిన చిక్క వీరయ్య ప్రత్యేక ఉపన్యాసంలో మాట్లాడుతూ.. మట్టిలోని బంగారాన్ని వెలికి తీసే శక్తి ఆయనకు ఉందన్నారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ జానకీ, కన్నడ సాంస్కృతికశాఖ సహాయ సంచాలకులు నాగరాజు, జిల్లా శాలివాహన కుంబర సంఘం అధ్యక్షుడు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయకోట పాఠశాలలో..

బళ్లారి సిటీ: వాస్తవ ప్రాతిపదికన సరళమైన భాషలో మూడు పంక్తులలో పద్యాన్ని రచించిన సర్వజ్ఞుని జయంతిని తాలూకాలోని సంజీవరాయకోట పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం, బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి సర్వజ్ఞుల చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఉదాత్తమైన ఆలోచనలను అలవర్చుకోవాలని సూచించారు. గ్రామంలోని పెద్దలను గౌరవించాలని, వారిలోని మంచి లక్షణాలను స్వీకరించి నైతికంగా ఉన్నతంగా జీవించాలని చెప్పారు.

సిరుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షంషాలం ఆధ్వర్యంలో సర్వజ్ఞ జయంతి వేడుకలను నిర్వహించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శ్వేత



సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో..



సర్వజ్ఞుడికి నివాళులర్పిస్తున్న రవి చెళ్లగుర్కి

హోసూరు జోన్

మాదకద్రవ్యాలకు బానిస కారాదు :కలెక్టర్



ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న సబ్ కలెక్టర్

హోసూరు, ఫిబ్రవరి 20: మాదకద్రవ్యాల వాడకంతో ఆరోగ్యం దెబ్బతినడమే కాక ఆర్థికంగా, సమాజంలో చిన్నచూపు చూస్తారని తద్వారా ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కారాదని కలెక్టర్ సరయు అభిప్రాయపడ్డారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రొహిబిషన్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కల్తీ మద్యం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. హోసూరు ఆర్‌వీ బాలుర ఉన్నత హైయ్యర్ సెకండరీ పాఠశాలలో ప్రారంభించారు. హోసూరు సబ్ కలెక్టర్ ప్రియా ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో కళాశాల విద్యార్థులు కార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు. కల్తీ మద్యం, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో అవగాహన కల్పించే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ర్యాలీలో డీఎస్పీ, ఇంజనీరింగ్, మహర్షీ విద్యాలయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నేతాజీ రోడ్డు మీదుగా హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు ర్యాలీ చేరుకుంది.

నగలు, నగదు చోరీ

హోసూరు, ఫిబ్రవరి 20: తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దుండగులు రూ.30 వేల నగదు, సుమారు 320 గ్రాముల నగలు దోచుకుని వెళ్లారు. హోసూరు రాయకోట రోడ్డులో నివాసముంటున్న రాధాకృష్ణన్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో తన సొంత ప్రాంతం కేరళ రాష్ట్రంలోని గ్రామానికి వెళ్లారు. కొద్ది రోజులుగా తాళం వేసి ఉండడంతో ఇంట్లో ఎవరూలేరని నిర్ధారించుకున్న దుండగులు సోమవారం అర్ధరాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న నగదు, నగలు, వెండి సామగ్రితో పరారయ్యారు. మంగళవారం విషయం ఘటన వెలుగు చూసింది. సీసీటీవీ పుటేజీలలో కూడా దొంగలు చొరబడినట్టు గుర్తించారు. టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నగరంలో ఈషా రథం సందడి

హోసూరు, ఫిబ్రవరి 20: కోయంబత్తూరులో ఇషా యోగా కేంద్రం ఆధ్వర్యంలో మహాశివరాత్రి పండుగ కనుల పండువగా జరగనుంది. మార్చి 8న జరిగే ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ఆదియోగి పరమశివుడి మూర్తితో కూడిన రథం ఊరేగింపు కోయంబత్తూరు నుంచి మొదలై వివిధ పట్టణాల్లో సంచరిస్తోంది. ఇందులో భాగంగా హోసూరు నగరానికి వచ్చిన ఆదియోగి శివరథానికి దర్గా ప్రాంతవాసులు శివనడియార్లు శివుని నామం జపిస్తూ గానం చేశారు. అలాగే ప్రజలు యోగి శివునికి పూజలు నిర్వహించి పూజలు చేశారు. ఇందుకోసం ఏర్పాట్లను హోసూరు ఇషా సెంటర్ కో ఆర్డినేటర్ నరసింహన్ నేతృత్వం వహించారు.



ఈషా రథం వద్ద భక్తాదులు

కాలు కదిపితే ప్రాణాలకు ముప్పే!




కుడితిని నుంచి బళ్లారి వైపు వస్తున్న బస్సు పుట్‌బోర్డుపై ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం

కంప్లి, ఫిబ్రవరి 20: ప్రతినిత్యం బస్సుల కొరతతో కళాశాలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సతమతమవుతున్నారు. ఉదయం వేళల్లో కంప్లి నుంచి బళ్లారి వైపుకు, సాయంత్రం బళ్లారి నుంచి కంప్లి వైపుకు బస్సుల కొరత వల్ల విద్యార్థులు సరియైన సమయానికి పాఠశాలలకు వెళ్లలేక ప్రతినిత్యం గైర్హాజరవుతున్నారు. ఒకరికొకరు తోసుకుంటూ, పుట్‌బోర్డుపై నిలబడుతూ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఆ పుట్‌బోర్డుపైన పాదాలు అదుపుతప్పితే ప్రాణం గాలిలో కలుస్తుంది. ఈ విషయంపై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అదిగో ఇదిగో బస్సు సౌకర్యం కల్పిస్తామని చెబుతున్నా ఇంతవరకు తగిన బస్సులను ఏర్పాటు చేయలేదు. ఉదయం వేళల్లో దరోజీ దేవలాపురం మెట్రి, దేవసముద్రం గ్రామాల ప్రజలు కంప్లికి వచ్చేందుకు ఆ సమయంలో బస్సుల కొరత వుండటంతో విద్యార్థులు పుట్ బోర్డుపై నిలబడి తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు. కుడితిని నుంచి కంప్లికి వచ్చే సమయంలో వున్న బస్సు సర్వీసులు కట్ చేయడంతో కండక్టర్లు బస్సు సర్వీసులు వున్నా రూట్‌లో తిప్పక సమయాన్ని తప్పించి రూట్‌పైకి బస్సులను నడుపుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపైన భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. అనేక మంది విద్యార్థులు తమ నిత్య జీవితంలో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఎన్ని కష్టాలున్నా వాటిని ఎదుర్కొని చదువుకునేందుకు ముందుకొచ్చినా చివరకు సరియైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు విద్యార్థుల కోసం సదుపాయాలు కల్పిస్తున్నామని చెబుతున్నారేగానీ బస్సుల సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

మీరా అల్ఫాస (జయంతి)



మీరా అల్ఫాస 1878 ఫిబ్రవరి 21న ఫ్రాన్స్ దేశం ప్యారిస్ నగరంలో జన్మించారు. ఆధ్యాత్మిక గురువులలో ఒకరిగా పేరొందారు. అరబిందో (అరవింద) ఆశ్రమ భక్తులు ఆమెను 'తల్లి' (మాత)గా పరిగణిస్తారు. అరవిందతో కలసి అతీత మానస యోగా విధానాన్ని ప్రారంభించారు. కాలక్రమంలో మీరా మారిసెట్, మీరా రిచర్డ్‌గాను పేరొందారు. కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి రాష్ట్రం ఆరోవిల్లెలో అరవింద ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంటిగ్రల్ యోగా ద్వారా ఎంతో మంది రచయితలను, ఇతరులను ప్రభావితం చేశారు. 1973 నవంబరు 17న కన్నుమూశారు.

భూపతి కృష్ణమూర్తి (జయంతి)



తెలంగాణ సరిహద్దు గాంధీగా పేరొందిన భూపతి కృష్ణమూర్తి 1926 ఫిబ్రవరి 21న వరంగల్ జిల్లా ముల్కనూరు గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి స్వతంత్ర భావాలు కల్గిన ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలో క్రియాశీలకంగా పని చేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. యువకులు, మేధావి వర్గాలు కలసి హైదరాబాద్‌లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) స్థాపించగా టీపీఎస్‌కు అధ్యక్షుడిగా ఉండి పార్టీని నడిపించారు. మలిదశ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. వయసు సహకరించకున్నా ఉద్యమంలో భాగస్వామ్యులయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని చూసి తనువు చాలిస్తానన్న భూపతి... అన్నట్టుగానే ప్రత్యేక రాష్ట్రాన్ని కళ్లారా చూసి 2015 ఫిబ్రవరి 15న కన్నుమూశారు.

అభిజిత్ బెనర్జీ (పుట్టినరోజు)



అభిజిత్ వినాయక బెనర్జీ 1961 ఫిబ్రవరి 21న బాంబేలో జన్మించారు. ఆర్థికశాస్త్రంలో ప్రొఫెసర్‌గా మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సేవలందిస్తున్నారు. ఆర్థిక శాస్త్రంలో సేవలకు 2019లో నోబెల్ స్మారక పురస్కారాన్ని భార్య ఈస్తర్ డఫ్లో, మైఖేల్ క్రెమెర్‌లతో కలసి అందుకున్నారు. అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్‌కు సహ సంస్థాపకులు. పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన అంశాలపై పలు పరిశోధనలు చేయడమేకాక రచనలు చేశారు. వివిధ యూనివర్సిటీల నుంచి గౌరవ పురస్కారాలు అందుకున్నారు.

ఏసీ చొరవతో రైతు సంఘం ధర్నా విరమణ



ఏసీ శివప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, ఫిబ్రవరి 20: రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక తాలూకా కార్యాలయం ధర్నా నిర్వహిస్తున్నారు. అయితే మధుగిరి ఏసీ శివప్ప మంగళవారం చొరవ తీసు కొని సర్దిచెప్పడంతో వారు ధర్నా విరమించుకున్నారు. అదేవి ధంగా కోటగుడ్డంలో ఓ మహిళా రైతు భూమిని ఆక్రమించుకున్న ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఏసీ శివప్ప హామీ ఇచ్చినట్టు రైతు సంఘం నాయకులు తెలిపారు. అదేవిధంగా బగర్‌హుకుం భూములను సాగుచేసిన రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏసీకి అందజేశారు.

11 ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం మడకశిర పట్టణంలోని 11 దేవాలయాల్లో డాక్టర్ శ్రీరంగం శ్రీనివాస్ వాసవీ మహిళా మండలి, భక్తబృందం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని కోట వెంకటేశ్వర స్వామి, ఊరి మారమ్మ, భోగ రామలింగేశ్వరస్వామి, షిరిడీ సాయిబాబా, ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి తదితర దేవాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భీష్ముడి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా అలాగే డబుల్ ఓటర్లు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 20: ఫిర్యాదు చేసినా డబుల్ ఓట్లను తొలగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కుణుతూరు గ్రామంలోని లేని వ్యక్తి ఓట్లు రెండు చోట్ల నమోదు కావడం విశేషం. ఇటీవల డబుల్ ఓట్ల తొలగింపునకు బీఎల్‌ఓలు, పార్టీల ప్రతినిధులు ఇంటింటి సర్వే చేపట్టారు. అయినా వాటిని తొలగించలేదు. ధర్మవరం పట్టణం దుర్గానగర్‌కు చెందిన దుర్వాసులుకు 241పోలింగ్‌బూత్‌లో సీరియల్ నెంబర్ 960లో ఓటు ఉంది. మళ్లీ కుణుతూరులో 586సీరియల్ నెంబర్‌లో దుర్వాసులు పేరుమీద ఓటు వచ్చింది. ఈ వ్యక్తి గ్రామానికి సంబంధించిన వారు కాదని, డోర్ నెంబర్‌కూడా అదేగ్రామానికి చెందిన మరోకరిది పెట్టి ఓటు జాబితాలోకి చేర్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఉన్న వ్యక్తికి మా గ్రామంలో ఎలా ఓటు ఎక్కిస్తారని ఆగ్రామస్థులు బీఎల్‌ఓలను ప్రశ్నిస్తున్నారు. అధికారులకు సరైన ఆధారాలతో నివేదికలు ఇచ్చిన మళ్లీ అవే తప్పులు చేస్తున్నారని, బీఎల్‌ఓల నిర్లక్ష్యంతో డబుల్ ఓట్లు వచ్చాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు.

శాసనసభను కుదిపేసిన న్యాయవాదులపై ఎఫ్ఐఆర్ వివాదం

- ఎస్ఐ సయ్యద్ తన్వీర్ సస్పెండ్ కోసం ప్రతిపక్షాల పట్టు
- పోడియంలో ధర్నా మధ్యే కీలకబిల్లుల ఆమోదం

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జ్ఞానవాపి మసీదు వివాదానికి సంబంధించి తీర్పునిచ్చిన న్యాయమూర్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన దేశద్రోహిని శిక్షించకపోగా రామనగరలో 40మంది న్యాయవాదులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన అంశం శాసనసభను మంగళవారం తీవ్రంగా కుదిపేసింది. ప్రభుత్వానికి కొమ్ముకాసేలా ఓ వర్గానికి రక్షణ ఇచ్చేలా వ్యవహరిస్తున్న రామనగర సబ్ఇన్‌స్పెక్టర్ సయ్యద్ తన్వీర్‌ను తక్షణం సస్పెండ్ చేయాలంటూ ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్‌లు డిమాండ్ చేశాయి. దీనిపై హోం మంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాల్సిందిగా చన్నపట్టణ డీఎస్పీకి సూచించామని, నివేదిక అందాక ఒకవేళ దోషిగా తేలితే చర్యలు తప్పవన్నారు. నిజాలు నిగ్గు తేలేంతవరకు ఏకపక్షంగా ఎస్సైను సస్పెండ్ చేయలేమన్నారు. ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మాట్లాడుతూ వివాదాల కేంద్ర బిందువుగా ఉన్న ఎస్సైను సస్పెండ్ చేసి గూండా చట్టంకింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యుడు యత్నాళ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హిందువులపై దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగా ప్రభుత్వానికి ఉంటే ఎస్సైపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. పోలీసులు, న్యాయవాదుల మధ్య ఘర్షణ కొనసాగితే రానున్న రోజుల్లో సమస్య మరింత జటిలం కావచ్చునన్నారు. రామనగర లో న్యాయవాదులను బీజేపీ దారి తప్పిస్తోందని, అక్కడ జరుగుతున్న ధర్నా రాజకీయ ప్రేరేపితమన్నారు. రాజకీయాలు చేసుకోవడం తప్పు కాదని, అయితే ఇందులో న్యాయవాదులను కూడా లాగడం దారుణమన్నారు. హైకోర్టు న్యాయమూర్తిని నిందించిన కేసుకు సంబంధించి తాము జోక్యం చేసుకోమన్నారు. న్యాయవాదులతో చర్చకు సిద్ధమని, చట్టం పరిధిలో సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి అంశాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని, మతసామరస్యాన్ని దెబ్బతీసి రాజకీయపబ్బం గడుపుకోవాలని చూస్తోందని అధికార పార్టీ సభ్యులు సభలో విరుచుకుపడ్డారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ అంశంపై తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. ఇలా సభలో బీజేపీ, జేడీఎస్ ధర్నా కొనసాగుతుండగానే పలు కీలకమైన బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించింది. వీటిలో బీబీఎంపీ సవరణ బిల్లు కూడా ఉంది.

వచనాలతో చైతన్యం కల్పించిన సర్వజ్ఞ



సర్వజ్ఞ జయంతిలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 20: బతుకు సమస్యలను ముక్కుసూటిగా, స్పష్టంగా తెలియచేస్తూ వచనాల ద్వారా సమాజంలో సమానత సాధించేందుకు ఎంతో కృషి చేసిన గొప్ప కవి సర్వజ్ఞ అని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. పురసభ కార్యాలయ ఆవరణలో మంగళవారం జాతీయ పండుగల ఆచరణ సమితి, కుంబార సంఘం ఆధ్వర్యంలో సర్వజ్ఞ జయంతి, ప్రతిభాపురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రచనలు చేసి సమాజంలోని మూఢ నమ్మకాలు, కుల వ్యవస్థ, అస్పృశ్యతపై పోరాటం చేశారన్నారు. 12వ శతాబ్దంలో బసవణ్ణ, 16వ శతాబ్దంలో సర్వజ్ఞల వచనాలు నేటికీ ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటిపై పరిశోధన చేసి ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. కుండల తయారీపై ఆధారపడిన కుంబార సమదాయానికి ప్రభుత్వం నుంచి సౌలభ్యాలు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు డైరెక్టర్ గోవిందరాజు, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవికుమార్, పురసభ ముఖ్య అధికారి మీనాక్షి, కుంబార సంఘం గౌరవ అధ్యక్షుడు ఆదినారాయణ, కోశాధికారి కేఎస్ఆర్టీసీ జయ రామ్, సామాజికవర్గ ప్రముఖులు కృష్ణప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అప్పయ్యగౌడ, ప్రముఖులు మేస్త్రీ శ్రీనివాస్, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

అబలలకు ఆశ్రయం ఇవ్వాలి



సామాజిక దినోత్సవం ప్రారంభంలో జిల్లా న్యాయాధికారి నాగవేణి తదితరులు

చింతామణి, ఫిబ్రవరి 20: సమాజంలో బాలికలపై లైంగిక దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, అసహాయకులు, అబలలకు ఆశ్రయం ఇవ్వాలని రెండో సెషన్స్, జిల్లా న్యాయాధికారి నాగవేణి అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై కనీస అవగాహన పెరగాలన్నారు. తాలూకా న్యాయసేవల సమితి, చింతామణి న్యాయవాదుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జేఎంఎఫ్‌సీ కోర్టు ఆవరణలో వరల్డ్ సోషల్ జస్టిస్ దినోత్సవంలో భాగంగా చట్టంపై జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వృద్ధులు, అబలలు, పిల్లలు, పేదలకు సామాజిక న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో వెనుకబడిన అన్ని వర్గాలకు ఆర్థిక, విద్యాపరంగా పురోగతి సాధించేలా అమలు కావడం ద్వారా సామాజిక న్యాయం దక్కేలా చూడాలన్నారు. సీనియర్ న్యాయవాది జీఎం ఇబ్రహీం మాట్లాడుతూ 2007 నవంబరు 27న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో ఏటా ఫిబ్రవరి 20న సామాజిక న్యాయ దినోత్సవం ఆచరించేలా తీర్మానించారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సీనియర్ సివిల్ న్యాయాధికారి, తాలూకా న్యాయసేవల సమితి అధ్యక్షుడు పీఎం ప్రకాశ్, ప్రధాన సివిల్ న్యాయాధికారి, తాలూకా న్యాయసేవల సమితి మెంబర్ సెక్రటరీ హెచ్‌వీ శైలజా, సివిల్ న్యాయాధికారి రూప, న్యాయవాదుల సంఘం పదాధికారులు, తదితరులు పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

'పరివర్తన్ - ప్రిజన్ టు ప్రైడ్'కు అనూహ్య స్పందన



మీడియాతో సంస్థ ఉన్నతాధికారులు

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ సంస్థ తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభించిన పరివర్తన్ ప్రిజన్ టు ప్రైడ్ కార్యక్రమాన్ని కర్నాటకకు విస్తరించింది. ఇందులో భాగంగా శివమొగ్గ సెంట్రల్ జైల్లో ఏర్పాటైన కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. శివమొగ్గ జైల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ అనిత, అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారిణి తృప్తి ముర్గుండేతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. పరి వర్తన్ ఏడో దశ కార్యక్రమం కోసం 11 జైళ్లను 12 జువెనైల్ హోమ్‌లను ఎంపిక చేశామన్నారు. 14 రాష్ట్రాల నుంచి 1115 మంది ఖైదీలకు పలు క్రీడాంశాలలో నిపుణులైన కోచ్‌లతో ప్రత్యేక శిక్షణనిప్పించనున్నట్లు ఆయనచెప్పారు. కాగా కర్ణాటకలోని శివమొగ్గ జైలులో 30 మంది ఖైదీలకు ఒక నెల పాటు వాలిబాల్, చెస్ క్రీడల్లో శిక్షణనివ్వనున్నారు. 2021 ఆగష్టు 15న ప్రారంభమైన పరివర్తన్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా 6,300 ఖైదీలు పలు క్రీడాంశాలలో అత్యుత్తమ శిక్షణ పొందారని తద్వారా తమ జీవితాలకు కొత్తరూపాన్ని అందుకున్నారన్నారు. ఈ మేరకు సంస్థ నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

గుడార్లహళ్లి డెయిరీ అధ్యక్షుడిగా మంజునాథ్



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాలసంఘం డైరెక్టర్లు, తదితరులు

చింతామణి, ఫిబ్రవరి 20: తాలూకాలోని మురుగమల్ల హోబళి గుడార్లహళ్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా వీ మంజునాథ్, ఉపాధ్యక్షుడిగా జీ రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వెంకటచలపతి ప్రకటించారు. పాలడైరీ డైరెక్టర్ల స్థానాలకు ఇప్పటికే జరిగిన ఎన్నికల్లో అందరూ ఏకగ్రీవం కాగా మంగళవారం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలు కూడా ఏకగ్రీవం కావడం విశేషం. రెండోసారి గెలుపొందిన అధ్యక్షుడు వీ మంజునాథ్ మాట్లాడుతూ డైరెక్టర్లు, పాడిరైతుల సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలు పాడిరైతులకు అందేలా పాటుపడతానన్నారు. నూతనంగా గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పూలమాలలతో ఆత్మీయంగా సత్కరించారు. కార్యదర్శి శ్రీరామరెడ్డి, డైరెక్టర్లు ఎల్ కృష్ణప్ప, కేబీ నాగరాజ్, శివారెడ్డి, జీవీ వెంకటరెడ్డి, జీఎన్ సుబ్రమణి, లక్ష్మీదేవమ్మ, జీఎం నరసింహప్ప, నారాయణ స్వామి, టీఎం అనితా, జీఏ మంజునాథ్, శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు పటేల్ వెంకటరెడ్డి, తాలూకా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీరామప్ప, సీనప్ప, శ్రీనివాసప్ప, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నగరంలో 'కాకదోష' నాటక ప్రదర్శన



నాటకంలోని ఒక సన్నివేశం

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత నాటక రంగ కళాకారిణి అనుపమా చంద్రశేఖర్ రచించగా దానిని కాకదోష పేరుతో కన్నడ భాషలోకి వెంకటేశ్ ప్రసాద్ అనువాదం చేసి దర్శకత్వం వహించారు. ఈ నాటక ప్రదర్శన రంగశంకరలో ఈ నెల 22, 23 తేదీల్లో ఏర్పాటవుతోందని నిర్వహకులు నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు ప్రకాష్ బల్వాడి, ఎంఎస్.సత్యు, అభిషేక్ మజుందార్, మోహిత్ తకాల్కర్, శ్రీపాదభట్, ప్రమోద్ శిగ్గావ్, శ్యామ్ కుట్టి పట్టంకరి, ఎస్.సురేంద్రనాథ్ వంటి నాటకరంగ కళాకారులతో పనిచేసిన వెంకటేష్ ప్రసాద్ కాకదోషను అద్భుతమైన దృశ్యకావ్యంగా తీర్చిదిద్దారని నిర్వహకులు ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఒక సంప్రదాయ కుటుంబానికి చెందిన మహిళ భర్తను కోల్పోయిన తర్వాత దూరంగా ముంబైలో ఉన్న తన కుమారుడిని నేరస్థుడిగా చూడాల్సి రావడంతో పడే తపనను ఇతివృత్తంగా తీసుకున్నారు. నాటకాన్ని వీక్షించి ఆదరించాలని నిర్వాహకులు కోరారు.

తాదూరు పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ల ఎన్నిక



నూతన డైరెక్టర్లతో గ్రామప్రముఖులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 20: తాలూకాలోని తాదూరు గ్రామపాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు 13మంది గెలుపొందారు. మునేగౌడ, నరసింహమూర్తి, మంజునాథ, గంగిరెడ్డి, రామాంజి, మునేగౌడ, మురళి, బేబి, రత్నమ్మ, ఇంద్రమ్మ, మునికృష్ణ, టీబీ నరసింహప్ప, మునికృష్ణప్పలు నూతన డైరెక్టర్లుగా విజయం సాధించారు. గ్రామ ప్రముఖులతో కలసి ఎమ్మెల్యే రవికుమార్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నూతన డైరెక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ సభ్యులు తనుజా రఘు, ప్రభాకర్, మునేగౌడ, శివశంకర్, మునిరాజు, పటేల్, సుబ్బరాయప్ప, మునికృష్ణప్ప, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో రాజ్యాంగ రథ జాతా



జాతాలో పాల్గొన్న గ్రామస్థులు తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ఆశయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో జాగృతి జాథా సాగుతోందని జేడీఎస్ ప్రముఖుడు బీఎన్ సచిన్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మేలూరు గ్రామానికి మంగళవారం రాజ్యాంగ జాథా రథోత్సవానికి స్థానికులు ఆత్మీయంగా స్వాగతించారు. సచిన మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగానికి ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు దక్కిందని ఇందుకు ప్రధాన కారణంగా అన్ని వర్గాల సంక్షేమానికి రాజ్యాంగంలో పొందు పరచడమేనన్నారు. రాజ్యాంగ హక్కులు, ఆశయాలు, కర్తవ్యాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఊరేగింపులో వందలాదిమంది గ్రామస్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తాలూకం పంచాయతీ నరేగా సహాయక డైరెక్టర్ చంద్రప్ప, మేలూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ, ఉపాధ్యక్షుడు శివానంద, జిల్లా జాగృతి సమితి సభ్యుడు మంజునాథ్, డీఎస్ఎస్ జిల్లా సంచాలకులు ఎన్ఏ వెంకటేశ్, ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అనూరులో చౌడేశ్వరిదేవి రథోత్సవం

చింతామణి, ఫిబ్రవరి 20: తాలూకాలోని అనూరు గ్రామం పెద్దచెరువు సమీపాన వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ 20వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 22న రథోత్సవం జరుగనుంది. ఆలయంలో మహాగణపతి, నవగ్రహాలు ఉన్నాయి. ఉత్సవాల్లో భాగంగా 21న బుధవారం గణపతి పూజ, గంగపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, రక్షాబంధన, కళశస్థాపన, గణ హోమం, బలిహరణ, మహామంగళారతి జరగనున్నాయి. సాయంత్రం నవగ్రహ హోమం, రుద్రహోమం, బలహరణ, అష్టావధాన మహామంగళారతి తదితర ధార్మిక కార్యక్రమాలు ఉంటాయి. 22న గురువారం నిత్య కళశారాధన, మూలవిరాట్టుకు అభిషేకం, ఖడ్గమాల, లలితా సహస్రనామ పారాయణ, దుర్గాహోమం, అష్టావధాన, పూర్ణాహుతి, బలిహరణ అనంతరం మధ్యాహ్నం 12.30గంటలకు చౌడేశ్వరిదేవి బ్రహ్మరథోత్సవం పురవీధులలో కొనసాగనుంది. అర్చకుడు వినయ్‌కుమార్‌శర్మ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. రథోత్సవానికి తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కేవీ సుబ్బారెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి దొడ్డపురకు చెందిన పీవీ నారాయణ స్వామి, ఆలయ కమిటీ పదాధికారులు పాల్గొననున్నారు.

కట్టిపడేసిన కలర్స్ బ్రీజ్



కళాఖండాల ప్రదర్శన వీక్షణ

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వసంత ఆర్ట్స్ ఆధ్వర్యంలో బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్ సభాభవనంలో ఏర్పాటైన కలర్స్ బ్రీజ్ చిత్ర కళా ప్రదర్శన సందర్శకులను విశేషంగా అలరించింది. కర్ణాటకతో సహా వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది వర్ధమాన చిత్రకారులు సీనియర్ చిత్రకారుడు కే మాల్యాద్రి సారథ్యంలో తమ కుంచె నుండి జాలువారిన అద్భుత కళాఖండాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రజాపనుల శాఖకు చెందిన చీఫ్ ఇంజనీర్ ప్రదీప్ మిత్ర మంజునాథ్, బోధి సంస్థ డైరెక్టర్ శివానంద బసవంతప్ప, ప్రముఖ సాహితీవేత్త వీ చండీశ్వర్ , పారిశ్రామిక వేత్త సంజీవ్ కోలి శెట్టి, షేడ్స్ క్రియేటివ్‌కు చెందిన సఫియా హయత్, పారిశ్రామిక వేత్త టీ నాగేశ్వరరావు తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్ని చిత్రకారులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రకృతి, వన్యజీవులు, దేవి దేవతలు, నగర జీవనం వంటి వాటిని ఇతివృత్తంగా తీసుకుని చిత్రకారులు ఈ కళాఖండాలకు ప్రాణం పోశారు. ప్రదర్శన విజయవంతంగా మంగళవారం ముగిసిందని వందలాది మంది వీటిని తిలకించారని చిత్రకారుడు మాల్యాద్రి మీడియాకు చెప్పారు. ప్రదర్శనలో ఇర్ఫాన్, వరుణ్ ఎన్.రావ్, స్వరూప్ ముర్‌గోడ్, గుర్‌దీప్‌సింగ్ చబ్బా, పూర్ణిమా అరవింద్, పులి విజయకిషోర్, భువన విశ్వనాథం, జాక్విలైన్ లోబో జాన్, ఖుషి తాతిని రాయ్, సంగీత కృష్ణన్, హెచ్.అఖిల, స్వాతి నందిగం, ఎంజీ ప్రణీత, అమితా సంపజె, నిధి సందేశ్, రమ్య విజయకుమార్, మన్‌మీత్ గిల్ తమ కళాఖండాలను ప్రదర్శనలో ఉంచారన్నారు.

ఘనంగా సద్గురు యోగీశ్వర మందిర జీర్ణోద్ధరణ

చేళూరు, ఫిబ్రవరి 20: తాలూకాలోని చిలకలనేర్పు గ్రామానికి చెందిన సూళ్యారు నారాయణరావు కుటుంబ సభ్యులు తమ స్వగ్రామం సూళ్యారులో సద్గురు యోగీశ్వర యాజ్ఞవల్క్య మందిర జీర్ణోద్ధరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మూడురోజులపాటు పలు ధార్మిక కైంకర్యాలు నిర్వహించారు. వేదమాత గాయత్రీ దేవి, యోగీశ్వర విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన గిరీశ్‌శర్మ నేతృత్వం వహించగా 1008 శ్రీవిద్యకన్వవిరాజ తీర్థ శ్రీపాద గురువులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య నారాయణస్వామి పర్యవేక్షించారు. సోమవారంతో ముగిసిన కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేకపూజలు



నరసింహస్వామి అలంకరణలో కొలువుదీరిన చంద్రమౌళీశ్వరస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: పట్టణ సమీపంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం పురస్కరించుకొని స్వామిని నాణ్యాల అలంకరణతో కొలువు దీర్చారు. మాఘమాసం 11వ రోజు పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలను నిర్వ హించారు. పట్టణంలోని మిట్టబండ అంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ చేశారు. అభయ అంజనేయస్వా మి ఆలయం తోపాటు వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20: మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు పాలిసెట్-2024 దరఖాస్తులు ఆ హ్వానిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి అర్హతగల విద్యార్థులు అర్హులని, ప్రస్తుతం పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఏప్రిల్ 5వరకు జ్టిఇట//ఇౌజూయ్బిఇజీచి.జీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20 : సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశించారు. మంగళవారం స్థానిక జేఎన్‌టీయూ ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ టీం లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీంల అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బృందాలు జిల్లా స్థాయి శిక్షణ తరువాత మార్చి మొదటి వారంలో ఆర్ఓ స్థాయిలో మరోసారి శిక్షణ ఉంటుందన్నారు.